
# అరచేతిలో గీత



సరిగ్గా ఐదేండ్ల క్రితం ఆమెను చూశాడు చిట్టిబాబు. ఐదేండ్ల క్రితం ఆమె వయసు పదిహేనేండ్లు. పదిహేనేండ్ల కే పట్టపగ్గాలు లేని ప్రాయం ఆమెది. అప్పుడు ఆమె బాలకాని ప్రౌఢ. ప్రౌఢకాని బాల. ఒంటి నిండుకు వంపులు. ఆ వంపుల్లో సొంపులు. ఆ వంపుసొంపులన్ని ఇముడ్చుకోలేక నిట్టూర్పుల్లో దుస్తులు. అన్నిటికీ ఇంపు కూర్చుతూ ఒకటీ రెండు సొమ్ములు. అందమైన లేడిపిల్ల లా కనిపించేది. హుందాగా రాజహంసలా నడిచేది. ఆమె అలా నడుస్తూవుంటే ఎప్పుడూ పక్కన మరొక ఆవిడ. ఆ మరొక ఆవిడ ఇరవై సంవత్సరాల వయస్సుకే ముప్పై ఏండ్ల మనిషిగా కనిపిస్తుంది. ఆ ముప్పయియేండ్ల మనిషి ముద్దుగా బొద్దుగా అందమైన పీపాలా ఉంటుంది. ఇద్దరు పక్కపక్కనే నడుస్తారు. ఒకరినొకరు రాచుకొంటూ నడుస్తారు. ఒకలావుకొమ్మ మరొక సన్నకొమ్మ. రెండుకొమ్మలు. ఒకదానినొకటి ఒరుచుకున్నట్లుంటుంది. ఎంతో ఒద్దికగా ఉన్నట్లు కనిపిస్తారు. 'అమ్మ కూతురు' అంటారు కొందరు. 'కాదు!' అంటారు కొందరు. అవునో- కాదో అంటారు మరికొందరు. దీనికి కారణం వాళ్ళ చేతుల్లో పుస్తకాలు. అవి ఒకేమోస్తరుగా కనిపిస్తాయి. అందుకే వాళ్లను చూసి 'ఆవు-దూడ' అంటారు అందరు.

ఆ మాట విన్నపుడు 'ముసిముసి'గా నవ్వుతాడు చిట్టిబాబు. నవ్వుతూ ఆలోచిస్తాడు. ఆలోచిస్తూ 'ఆహా! ఓహో!' అంటాడు. ఆ పైన తానుకూడ 'ఆవు దూడ!' అంటాడు.

ఆ రోజు సాయంకాలం. అందమైన బజార్లో ఆలోచిస్తూ నడుస్తున్నాడు చిట్టిబాబు. ఆవు దూడను గురించి ఆలోచిస్తూ నడుస్తున్నాడు. ఆవును వదిలి దూడ రాదు. దూడను వదిలి ఆవు రాదు. దూడ లేకపోతే తాను లేడు. 'దూడ! దూడ!' అని ఆలోచిస్తూ ఉంది మనసు. అసలు చిట్టిబాబు అంటేనే ఆలోచనకు ప్రతిరూపమంటారు కొందరు. 'పుస్తకాల పురుగ్గా ఉంటాడు' అంటారు అతనితో అప్పుడప్పుడు మాట్లాడేవాళ్ళు. 'హెచ్చులమారి లచ్చుం గాడు!' అంటారు అతనితో కలిసి పనిచేసే వాళ్ళు. 'పాపం! నిస్వార్థుడు!' అంటారు. అతనివద్ద అడపా దడపా చదువుకోవడానికి నవలలు తెప్పించుకొనే అమ్మాయిలు. 'అబ్బే! బతకలేనివాడు!' అంటాడు నాడారు. ఎవరేమన్నా పెడచెవిని పెడతాడు చిట్టిబాబు. అసలు ఇవన్నీ కాకికూతలని అతని నమ్మకం.

అయిదేండ్లకు ముందు. అంటే ఆవు దూడను చూడక ముందు అరచేతిలో గీతలు చూసుకొనేవాడు చిట్టిబాబు. కుడిచేతి నిండుకు గీతలు. ఆ గీతల నిండా భావి జీవిత బాగోగులు. అన్ని గీతల్లోను ఒక్క గీతంటే మహాయిష్టం అతనికి, ఎందరో ఉంటే దూడమీదనే మోజు పడినట్లు! ఆ గీత లోనే తన 'తలరాత' ఉందనుకొంటాడు. తలరాతను ఆ గీత తప్పకుండా మారుస్తుందనుకొంటాడు. తలరాతే మారితే... మళ్ళీ ఆలోచిస్తాడు.

ఒకప్పుడు డబ్బు అంటేనే వెగటు చిట్టిబాబుకు. డబ్బులో ఏముందిలే అనుకొన్నాడు. తెలివితేటల్లోనే అంతా ఉందనుకున్నాడు. ఆ 'అంతా' సంపాదించడానికి తెగ చదివాడు. తెగ తిరిగాడు. తెగ చదివితే తెలివితేటలు. తెగ తిరిగితే అనుభవాలు. అందులోనే ఆ 'అంతా' ఉందని భ్రమపడ్డాడు. తెగ చదివి తెగ తిరిగితే అలసిపోయేది శరీరం. అలసిపోయిన శరీరం తేరుకోవడానికి ఏదో కావలసివచ్చేది. ఆ 'ఏదో' కావాలంటే మరేదో కావాలి. ఆ మరో దానికి మారు పేరే డబ్బు. అదే లేదు చిట్టిబాబుకు. అందుకే ఇప్పుడు అంతా డబ్బులోనే ఉందనుకొంటాడు. ఆ డబ్బును తేగలిగేది తన చేతిలో ఆ ఒక్క గీత! అందుకే ఆ గీత అంటే అతనికి మహాయిష్టం.

ఆ గీత ప్రభావమే జరగాలి. తన రాతే మారాలి. ఆలోచిస్తాడు చిట్టిబాబు. సాధారణంగా సామాన్యులైతే ఓ పెద్ద మేడ... హంసతూలికా తల్పాలు... పంచభక్ష్యపరమాన్నాలు... కారు... దర్పం... దర్జా... అలా అలా ఆలోచిస్తారు. కానీ అందరిలాంటివాడు కాదు చిట్టిబాబు. అతనికి కొన్ని నిశితమైన అభిప్రాయాలున్నాయి. కొందరిమీద అతనికి చెప్పలేనంత కసి! కొందరిమీద అతనికి ఎనిలేని కనికరం.

బజారు నడిబొడ్డులో ఓ పెద్ద బట్టల కొట్టు. దాన్ని పక్కన్నే కిరాణా కొట్టు. ఆ పక్కనే దేశంలోని 'ఏజెన్సీ' లన్నీ కూడిన స్థలం. ఆ కూడలి పక్కన 'హోల్‌సేల్' బియ్యం దుకాణం.

దానికి ఎదురుగా బ్రాందీషాపు. వీటన్నిటినీ కలిపితే ఆంగ్లంలో 'గ్రూప్' అంటారట. ఆ 'గ్రూప్'కు అధినేత ఓ గుప్త. ఆ గుప్త నల్లగా ఉంటాడు. నల్లగా ఉన్నా నున్నగా కరిబూజ కాయలాగ ఉంటాడు. ఆ నల్లని నున్నటి ఒంటిమీద తెల్లటి మల్లుజుబ్బా ఉంటుంది. మల్లు జుబ్బా మరుగుపరచలేనిమసిబానలాంటి పొట్టకూడ ఉంటుంది గుప్త గారికి. ఎప్పుడు కిరాణాకొట్టు ముందు కూర్చుంటాడు. ఆయన ముందర పదిపైసాలు పకోడీ పొట్లం ఉంటుంది. కొట్టుకు వచ్చిన వాళ్ళందరికీ ఆ పకోడీ పొట్లం చూపిస్తాడు. చూపిస్తూ అందరినీ తీసుకోమంటాడు. తీసుకోమంటూ మళ్ళీ తానే తీసుకొని వడేసి వడేసి నములుతూ ఉంటాడు. తన రాతే మారితే, ఆ గీత ప్రభావమే జరిగితే, మొట్టమొదటిసారిగా ఆ శెట్టి పొట్టను తూట్లు తూట్లుగా పొడవాలను కొంటాడు.

చిట్టిబాబు ఆఫీసుకు వెళ్ళేదారి ఒకప్పుడుమట్టిబాట. కొంతకాలానికి అది కంకరబాట అయింది. మరలా తారురోడ్డుగా మారింది. ఇప్పుడు సిమ్మెంటు రోడ్డుగా మారుతూ ఉంది. ప్రణాళికల మేరకు ఊపిరిలేని బాట బతుకు మారుతూ వచ్చింది. కానీ మట్టిబాటకోసం నెత్తి తట్టలతో మట్టి మోసిన అదే కూలీలు సిమ్మెంటు రోడ్డు కోసం 'గుల్ల' పగులకొడుతూనే ఉన్నారు. కంకర రోడ్డు వేయిస్తూ ఆనాడు అటూ యిటూ తిరుగుతూ ఆ పని ఈ పని చేస్తూ ఉండిన కంట్రాక్టరు సిమెంటు రోడ్డు వేస్తూంటే నింపాదిగా కారు కాను కొని నిలబడి ఉన్నాడు– ఒక కూలీ పట్టిన గొడుగు కింద! చిట్టిబాబు ఆ బాట మీద నడుస్తూనే ఉన్నాడు. నడుస్తూ చూస్తూనే ఉన్నాడు. చూస్తూ ఆఫీసులో పనిచేస్తూనే ఉన్నాడు. తనలో మార్పులేదు. గుల్ల కొట్టే కూలీలో మార్పులేదు. 'కాంట్రాక్టరు' మాత్రం కారు కొన్నాడు. అందుకే ఆలోచిస్తాడు చిట్టిబాబు. తన రాతే మారితే... ఆ గీత ప్రభావమే జరిగితే... ఆ గొడుగు తీసి గుల్ల పగల కొట్టే కూలీకి పట్టి కూలీ చేతిలోని సుత్తెను తీసి కాంట్రాక్టరు చేతికివ్వాలను కొంటాడు.

ఆ ఊళ్ళో ఓ నలుగురైదుగురు కనుపిస్తూ ఉంటారు చిట్టిబాబుకు. అలా కనుపించేది కూడ సభలు సమావేశాలు జరిగేటప్పుడే!... తనకు తెలిసి వాళ్ళకేమీ పనీపాట ఉన్నట్టులేదు. ఉండినా చేసేటట్టులేదు. కానీ బట్టలు మాత్రం మడత పడవు. అవికూడ ఖద్దరు బట్టలు!...... ఏ సభలో అయినా వాళ్ళే ముందు కూర్చుంటారు. కూర్చున్న వాళ్ళు కుదురుగ ఉండరు. ఉండకుండా లేచి వాగుతారు. వాళ్ళు వాగింది వాళ్ళకే తెలియకుండా వాగుతారు. దానికే మురిసి వాళ్ళకు పూలమాలలు వేస్తుంటారు ఎవరో తాగుబోతుముండా కొడుకులు. అది చూసి ఆలోచిస్తాడు చిట్టిబాబు. తన 'రాతే' మారితే, ఆ గీత ప్రభావమే జరిగితే ఏ అమెరికా నుండి, లేదు రష్యానుండి గుట్టు చప్పుడుగ నాలుగు బాంబులు తెప్పించి ఆ తాగుబోతు ముండా కొడుకులు పూలమాలలు వేసేటప్పుడు వాళ్ళ నెత్తిన ఈ బాంబులు వేయాలను కొంటాడు.

తాను ఆఫీసుకు వెళ్లే దారిలోనే దాదాపు ఊరి పొలిమేరల్లో ఓ గుడిసె ఉంది. ఆ గుడిసెలో ఓ గుడ్డి ముసల్ది ఉంది. ఆ ముసలిదానితో ఓ పడుచు పిల్ల ఉంది. ఆ పడుచు పిల్ల గుడిసె ముందు నిలబడుతుంది. నిలబడి వచ్చే పోయే వాళ్ళను చూస్తూ ఉంటుంది. చూస్తూ పైట

తీస్తూ వేస్తూ ఉంటుంది. పైట తీస్తూ వేస్తూ కళ్ళతో నవ్వుతుంది. ఆ నవ్వులో పిలుపు ఉంది. ఆ పిలుపును గ్రహించిన కుశాగ్రబుద్ధులు అటు యిటు చూసి ఎవరో ఒకరు వెళుతూనే ఉంటారు. వెళ్ళినవారు నవ్వుతూ తిరిగి వస్తూనే ఉన్నారు. కొందరు వెళ్ళుతున్నారు. ఆ పడుచుపిల్ల గుడిసె ముందు నిలబడి ఎప్పుడు ఎదురు చూస్తూనే ఉంటుంది. దానిమీద ఎనలేని కనికరం చిట్టిబాబుకు. పాపం!... ఆ పిల్ల... కడుపు కూటి కోసం కళ్ళు చించుకొని ఎదురుచూసే ఆ పడుచు పిల్ల... ప్చ్... పాపం! తన రాతే మారితే... ఆ గీత ప్రభావమే జరిగితే, ఆ గుడిసెను ఓ మిద్దెగా మార్చి ఆ పడుచు పిల్లను ఎవరి చేతిలోనైనా పెట్టి వాళ్ళిద్దరు చిలకా గోరువంకల్లాగ కాపురం చేస్తుంటే చూడలని ముచ్చట పడతాడు.

అన్నిటికీమించి చిట్టిబాబుకు రచయితలంటే మహా గౌరవం. కారణం- తాను కూడ ఓ బుల్లి రచయిత కాబట్టి. అయితే తాను ప్రణయ గీతాలే రాస్తాడు. అది కవిత్వం కాదంటారు కొందరు. ఎవరేమన్నా, ఈ మధ్య వీళ్ళల్లో వీళ్ళు జుట్లు పట్టుకొన్నారని తెలిసి వాళ్ళంటే కాస్త నీళ్ళు నములుతున్నాడే కానీ, అంతకు మునుపు వాళ్ళంటే పడి చచ్చేవాడు. రచయితలంటే దైవాంశ సంభూతులని అతని అభిప్రాయం. వాళ్ళ కవితలు చదివి కన్నీరొలికించేవాడు. కథలు చదివి కరగి నీరై పోయేవాడు. వాళ్ళది జాలిగుండె అని అతడు తలస్తాడు. వాళ్ళు నీతికి నిజాయితీకి వారుసులని అతని గట్టి నమ్మకం. నీతి నిజాయితీ కలిగిన వాళ్ళందరూ ఈ లోకంలో బాధపడుతూనే ఉన్నారు. దరిద్రులుగానే ఉన్నారు. కాబట్టి రచయితలందరు కూడ దరిద్రులుగానే ఉంటారు. ఇది ఊహించలేనిది. సహించరానిది. దీనికి కారణం సమాజమే అని అతని అభిప్రాయం. సమాజం బాగుకొరకు పాటుపడే రచయితను సమాజమే బాగు పరచాలంటాడు చిట్టిబాబు. అందుకే ఆలోచిస్తాడు. తన 'రాతే' మారితే, ఆ గీత ప్రభావమే జరిగితే దినాని కొక్క రచయితకు కనకాభిషేకం చేయాలనుకొంటాడు.

ఇలా దేశాన్ని ఉద్ధరించాలనుకొనే చిట్టిబాబు దేశాన్ని ఉద్ధరించలేని ఓ ఆఫీసు గుమాస్తా. గుమాస్తా అంటే నీకు గుమాస్తానా?- నీ యబ్బకు గుమాస్తానా?? అంటారేమో? ఎందుకు వచ్చిన బాధ? ....... ముచ్చటగా ఎన్జీవో అందాం. ఈ ఎన్జీవోను జీవసమాధి చేశారను కొంటాడు చిట్టిబాబు జీతం పేరుతో! జీవ సమాధిలో ఉండాల్సింది జీవిత కాలంలో సగం. పవిత్ర భారతావనిలో సగటువయస్సును లెక్క గట్టి ఆ సగ జీవిత కాలమంతా జీవ సమాధిలో ఉండ మనకుండా, దినంలో సగం కాలం ఉంటే చాలునని సరి పెట్టుకొని సహృదయతను ప్రకటించుకొనింది ప్రభుత్వం. కాబట్టి ఆఫీసులో అరదినం, బయట అరదినంగా గడుస్తూ ఉంది ఈ ఎన్జీవోలకు. చిట్టిబాబుకు అంతే మరి!

అలా బయటపడప్పుడు చిట్టిబాబు ఆలోచనలు బోలెడు! ఆవేశం జోలెడు!! ఫలితం సోలెడు!!!

రిక్షాతొక్కుతున్న వాణ్ణి చూస్తాడు. రిక్షాలో కూర్చున వాణ్ణి చూస్తాడు. కార్లోపోతున్న వాణ్ణి చూస్తాడు. కాలికి కాలు కొట్టుకొంటూ నడిచే వాణ్ణి చూస్తాడు. మోసపోయేవాణ్ణి గమనిస్తాడు.

మోసం చేస్తున్న వాణ్ణి గమనిస్తాడు. ఆ మీదట అందరిని ఒక వరసలో నిలబెట్టుతాడు. నిలబెట్టి ఆలోచిస్తాడు.

రిక్షా తొక్కుతున్నది మనిషే! – రిక్షాలో కూర్చున్నది మనిషే!!... కడుపులో చల్ల కదలకుండ కార్లో ప్రయాణం చేసేది మనిషే!... కాలుతున్న కడుపుతో మండుతున్న ఎండలో దారిలో పరుగులు తీస్తున్నది మనిషే!!... మోసపోతున్నది మనిషే!... మోసం చేస్తున్నది. మనిషే!!... ఒక్క దెబ్బతో చచ్చేటట్లుగ తుపాకీ గుండ్లను పేలుస్తున్నదీ మనిషే!... చస్తున్నదీ మనిషే!!... అందరు మనుషులే! అందరు తల్లి గర్భమునుండే పుట్టుతున్నారు. తల్లి గర్భంలో నుండి పుట్టినవాళ్ళందరు మనుషులుగానే పరిగణింపబడుతున్నారు. పుట్టినప్పుడు అందరినీ ఒకే రిజిస్టరులో నమోదు చేస్తున్నారు. గిట్టినప్పుడు కూడ ఒకే మట్టిలో వేస్తున్నారు. అయితే ఈ విడ్డూరం? –

తనకు ఊహతెలిసిన నాటినుండి ఆలోచిస్తున్నాడు చిట్టిబాబు. ఆలోచిస్తూ ఆవేశపడు తున్నాడు. ఆవేశపడుతూ ఆలోచిస్తున్నాడు. ఆపై అరచేతిలో గీతను చూసుకొంటున్నాడు. తన రాతే మారితే ఆ గీత ప్రభావమే జరిగితే ఏదో చేయాలనుకొంటాడు. చేయాలనుకొని చేసినంత సంతృప్తి పడతాడు.

ఓ రోజు సాయంకాలం. అందమైన బజార్లో ఆలోచిస్తూ నడుస్తున్నాడు చిట్టిబాబు. ఏదైనా ఆలోచించి చేయాలనుకొంటాడు. ఆలోచించేది చేయలేకపోతాడు. చేయగలిగింది ఆలోచించలేక పోతాడు. అయినా ఆలోచించకుండా ఉండలేక పోతాడు. అందుకే ఆలోచిస్తాడు. ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

పిచ్చి మనిషి! తన ఆలోచనలు తనకేగానీ, బజారంతా ఎంతో అందంగా ఉంది. సంజవెలుగు బజారుకే బంగారు పూత పూసింది. ఎవరి తాపత్రయం వాళ్ళదిగా జనం వస్తున్నారు. పోతున్నారు. కార్లు మోటార్లు అరుస్తునే ఉన్నాయి. ఆమె అందంగా ఉంది. అతడుకూడ ఫరవాలేదు. భార్యా భర్తల్లాగ ఉన్నారు. అయితేకూడ 'అంత అందగత్తె తనని వదిలి పారిపోతుందేమో?' అని ఆమె రెట్ట పట్టుకొని నడుస్తున్నాడు ఆ యువకుడు. 'పావలా పూలుకొనియ్యలేనోడివి. నువ్వా ఒక మొగాడేనా బావా?' అని వగలుపడుతూ వయ్యారంగా కులుకుతూ ఉంది ఒక పల్లెటూరి పిల్ల. అడిగింది కొని ఇవ్వలేదని నానా రభస చేస్తున్నా డొక కుర్రకుంక. సముదాయించడానికి, ఏడ్చేబిడ్డకు వెలగకాయ చూపిస్తూఉంది తల్లి. ఎంత చెప్పినా వినకుండా తల్లి పైటచెరగుపట్టి లాగుతున్నాడు. 'వదులు వెధవా!' అని రెండు అంటిస్తున్నాడు ఆ పైటకు అధికారి మగమహానుభావుడు. చిన్నెలు వన్నెలుగా సింగారించు కొని బిర బిర చరచర నడుస్తున్నారు కొందరు అతివలు సినిమాకోసమేమో?...

నిట్టూర్చాడు చిట్టిబాబు. లోకం తీరును ఆలోచిస్తూ నిట్టూర్చాడు. నిట్టూరుస్తూ ముందుకు సాగాడు. ఊరేగింపు ఎదురుపడింది. మొదట గజరాజు. ఆ తరువాత మేళతాళాలు.

గరుడవాహనారూఢుడై దేవుడు. ఆదేవుని కిరువైపుల దేవునిలాంటి ఇద్దరు మనుషులు. వీళ్ళను మోస్తూ, మోయలేక తనకలాడుతూ కొందరు సామాన్య మానవులు. దారి కిరువైపుల హారతి తట్టలు పట్టుకొని నమ్రతగా నిలబడివున్న ముత్తైదులు... ఆ వెనుక వేదపాఠం వల్లిస్తూ విప్రోత్తములు... చూడ ముచ్చటగా ఉంది దృశ్యం. చూస్తూ నిలబడ్డాడు. నిలబడి చూస్తున్నాడు. దారిన పోతున్నవాళ్ళు నిలబడుతున్నారు. కొందరు చెప్పులు విడిచి దండం పెడ్తుతున్నారు. కొందరు చేతితో ఏదో 'మ్యాజిక్' చేసినట్లు అరచేతిని మూతిముందు ఆడిస్తున్నారు. కొందరు చెంపలు పళపళ వాయించుకొంటున్నారు. కొందరు సున్నితంగా అలా అలా అనుకొంటున్నారు. కొందరు నేలపడి మొక్కుతున్నారు. ఆయన దృష్టికి అందరు సమంగా ఉన్నట్లుంది. ఎవరినీ ఏమీ అనలేదు. నిర్వికారంగా నిరామయంగా చిరునవ్వులు చిందిస్తున్నాడు. చూస్తున్నాడు చిట్టిబాబు. ఆ దేవుని పక్కన నిలబడివున్న ఇద్దరు దేవుని లాంటి మనుషులను చూస్తున్నాడు. ఒకతను హారతి పడుతున్నాడు. మరొకతడు పైకి చూస్తున్నాడు. పై లోకంలో ఉన్న దేవునికోసమేమో పైకి చూస్తున్నాడు. పక్కనున్న దేవుని కంటే పై లోకంలో ఉన్న దేవుడు గొప్పవాడేమో మరి! ఆ దేవుని లాంటి మనిషి పై లోకంలో చూస్తున్న దేవుణ్ణి చూడాలనుకొన్నాడు చిట్టిబాబు. అతని చూపులతో తన చూపులు కలిపాడు. దిగ్భ్రమ చెందాడు చిట్టిబాబు. ప్రత్యక్షమైంది పెద్ద చిత్రం! వర్ణనాతీతమైన రంగు రంగుల చిత్రం! ఒక కాలు, ఒక చేయి లేపగలిగినంత వరకు పైకిలేపి నృత్యభంగిమలో ఉన్న జ్యోతిలక్ష్మి చిత్రం! సినిమా పోస్టర్‌లోని జ్యోతిలక్ష్మి చిత్రం. దేవుని లాంటి మనిషి తప్పక చూడాల్సిన చిత్రం!

చిట్టిబాబు ఆలోచనలు చెదిరి పోయాయి ఓ క్షణం. చెదిరి, అటు ఇటు తిరిగి ఎక్కడికో వెళ్ళాయి. వెళ్ళి ఓ పుస్తకంలో తొంగి చూశాయి. అది తెన్నేటి సూరి కవిత!

కీలు గుఱ్ఱముపైన-బాలీసు కానుకొని
ప్రాణాలు లేనట్టి-భగవంతుడొచ్చాడు
ఊరంతా ఊరేగుతూ-ఉత్సవము సారించుతూ........

ఆ పైన సూరి ఎవరినో ఏమో అడగమన్నాడు. అది చూసిన చిట్టి బాబు తానూ అడగాలనుకొన్నాడు. అక్కడినుండి ఒక్క ఊపులో వచ్చి పడ్డాడు బజార్లో. లాభం లేకపోయింది. అప్పటికే వెళ్ళిపోయాడు దేవుడు!

దేవుడులేడు! దేవుడులేడు!!' అని గొణుక్కొంటూ ముందుకు సాగాడు చిట్టిబాబు, మలుపు తిరిగాడు. ఎదురుగా ఆ దేవుడి పుష్కరిణి. మురికి నీటి కంపు తెంపులు తెంపులుగా వస్తూ ఉంది. ఓమూల కొన్ని బోడిగుండ్లు స్నానానికి తయారవుతున్నాయి. మరో మూల ఎవడో ముడ్డికడగడానికి అటు యిటు చూస్తున్నాడు. ఇది దేవుని పుష్కరిణి అనుకొన్నాడు చిట్టిబాబు. కను చీకటి ఆవరిస్తూ ఉంది. విద్యుత్కాంతులు వింత కాంతులీనుతున్నాయి. ఆ కాంతిలో ఆ దేవుడి గాలి గోపురం డాబు సరిగా, దర్జాగా, దొమ్ము విరుచుకొంటూ నిలబడి ఉంది. ఎవరో

యాత్రికుడు ఆ గోపురాన్ని 'ఫోటో' తీయడానికి తంటాలు పడుతున్నాడు. ఆ గోపురాన్ని చూశాడు చిట్టిబాబు. చూస్తూ ఆలోచించాడు. ఆ గోపురం....... హైందవ సంస్కృతికి చిహ్నం. ఆలయ ప్రవేశానికి మహాద్వారం. ఆ ఆలయం ఉండేదొక పవిత్రపుణ్యక్షేత్రం. అప్పుడు తట్టింది అతనికి ఇది పుణ్యక్షేత్రమని. తాను నిలబడింది పుణ్యక్షేత్రంలో పుష్కరిణివద్ద అని! తనరాతేమారితే ఆ గీతప్రభావమే జరిగితే పుణ్యక్షేత్రంలోని పుష్కరిణిని బాగుచేయాలనుకొన్నాడు. దేవుడు చేయలేని పనిని తాను చేయాలనుకొన్నాడు.

ఇన్ని ఏండ్లుగ ఎన్నో ఏండ్లుగా దేవుడు ఆలోచించలేనిది తాను ఆలోచించాడు. దేవుడు చేయలేని పని తాను చేయబోతున్నాడు. తృప్తి తొణికిసలాడింది చిట్టిబాబు కన్నుల్లో! ఎంతో బరువు దించినట్లయింది చిట్టి బాబు గుండెల్లో!! ...... తేలికపడిన తనువు మూడడుగులు ముందుకు వేసింది.

"రూం కావాల్నా సార్!" ఆరేళ్ళ కుర్రవాడు అరవై ఏళ్ళ ముసలివాణ్ణి అడుగుతున్నాడు.

"ఏం రూం?" ఎదురుప్రశ్న వేశాడు అరవై ఏళ్ళ ఆసామి బొంగురు గొంతుతో.

"రూం సార్. రూం!" రెట్టించాడు కుర్రవాడు ఆమాత్రం తెలియదా అన్నట్లు.

"ఏముంటుందక్కడ?" కావలెననే కవ్వించింది ముసలి ప్రాణి.

"కుర్చీలుంటాయి. టేబిల్ ఉంటుంది. మంచముంటుంది. మంచం మీద పరుపుంటుంది. పరుపుమీద దిండ్లుంటాయి. పైన పంకా తిరుగుతూ వుంటుంది. స్నానానికి నీళ్ళుంటాయి. ఇంకా.........అదే! ఇంకా.........అదే! అదే! పిల్లలు కూడ ఉంటారు సార్!" ఠీవిగా నిలబడ్డాడు పాఠం బాగా అప్పచెప్పిన కుర్రవాడిలా ఆరేళ్ళ కుర్రవాడు. 'అహ్హహ్హా!' అని నవ్వుతున్నాడు ముదుసలి. అరిగిపోయిన పండ్లు అందంగా కనుపిస్తున్నాయి. మూరెడు ముందుకు వచ్చిన పొట్ట నవ్వుతూ ఉంటే ఎగిరెగిరి పడుతూ ఉంది.

మూడడుగులు ముందుకువేసిన చిట్టిబాబు ముఖం మూడు వంకరులుగ తిరిగింది. ముఖం మూడు వంకర్లు తిరిగితే ముంగాళ్ళకు బంధాలు పడ్డాయి. ముసలి ఆకారం ఆరేళ్ళ కుర్రవాడిని అనుసరించింది. చిట్టిబాబు నిలబడి పోయాడు. నిలబడివాళ్ళను చూస్తున్నాడు. చూస్తూ ఆలోచిస్తున్నాడు. ఇది పుణ్యక్షేత్రం. ఈ క్షేత్రానికి దైవదర్శనం కోసం ఎందరో వస్తున్నారు. ఎన్నో తరాలుగా వస్తున్నారు. అమ్మమ్మ అంటూ ఉండేది ఒకప్పుడు ఈ క్షేత్రంలో ఎంతో ఆచారముండేదట. ఇక్కడ పూచిన ప్రతి పూవు దేవునికోసమేనట! అందుకే ఆడవాళ్ళు తలలో పూవులు కూడ పెట్టేవాళ్ళు కాదట. ఆనాడు అంత నియమం. అంత నిష్ఠ. ఈ రోజు అంతా తారుమారయింది. క్షేత్రం విహార స్థలంగా మారింది. వీధికి రెండుమూడు లాడ్జీలు. లాడ్జీకి కనీసం పది పదిహేను గదులు. గదికి ముగ్గురు ముండలు! దేవుడి పేరుతో రావడం. గవర్నమెంటు సారాయి అంగడిలో దూరడం. ఓ లాడ్జిలో పడి పొర్లడం- ఓహ్! ఓయీ దేవుడా! నీ ధర్మాన ఎంత ఆనందం మోసుకొని పోతున్నారయ్యా ఈ భక్తులు! నిన్నుజూచి మరెంత పున్నెం మూటగట్టుకొని పోతున్నారయ్యా ఈ మానవులు!......

"వాడిచేతిలో పుండుపుట్ట. వాడి దూము వాడికి దగల! నామీద చెయ్యి చేసుకుణ్ణాడు. ఇరంపరంలేని యదవచెయ్యిపట్టి యీదిలో పడ్డి. వాడిగతి దేవుడే చూస్తాడులే!" ఎవరో ఒక నడివయసు ఆడది. నోట్లో రక్తం కారుతూ ఉంది. కళ్ళల్లో నీళ్ళు కారుతూ ఉన్నాయి. కన్నీటిలో కలిసిన రక్తం. రక్తంలో కలిసిన కన్నీరు. అప్పుడప్పుడు చేత్తో అటూయిటూ తుడుచుకోవడంతో మొగానికి వికృతంగా రంగువేసినట్లుంది. ఆమె ఏడుస్తూ ఉంది. ఏడుస్తూ తిట్టుతూ వడివడిగా నడుస్తూ ఉంది.

"నా కొంప నాయాలు కూలిస్తే, ఈడికొంప కూల్చేవాడు లేకపోలేదులే! డబ్బుచల్లి ఈ కోర్టులో గెలిస్తే సరిపోతిందా? ఇదంతా చూస్తానే ఉండాడులే పైన మండేవాడు!"– ఓ శవాకారం. 'హైకోర్టు వక్కీలు' అని వేలాడుతున్న బోర్డు ముందు నిలబడింది. నిలబడి వాపోతూ తెరలు తెరలుగా దగ్గుతూ ఉంది.

ఆ సమీపంలోనే పెద్ద హోటల్. వస్తూ పోతున్న వాళ్ళతో పెద్ద సందడిగా ఉంది. ఓ బిచ్చగాడు ఒక చేత్తో పగిలిన దొప్ప పట్టుకొన్నాడు. మరొక చేత్తో డొక్క తట్టుతున్నాడు. కడుపుమంటనంతా కంటిచూపుల్లో నిలపినట్లున్నాడు. 'ధర్మం బాబూ! దయచూడండి బాబూ!!' అని ఆగడం చేస్తున్నాడు. ఎవరో నవనాగరీకుడు 'ఏమిటీ న్యూసెన్సు?' అని హోటల్ అధినేతను అడుగుతున్నాడు. అధినేత ఎవడిమీదనో మండిపడ్డాడు అగ్గిమీద గుగ్గిలంలా. వాడు బిచ్చగాడిమీద విరుచుకపడ్డాడు. బిచ్చగాడు కదలనంటే కదలనంటున్నాడు. వాళ్ళ వాదం సాగుతూనే ఉంది. అంతలో మరొకడు ఓ పెద్ద చెంబు మంచి నీళ్ళుదెచ్చి బిచ్చగాని మొగాన కొట్టాడు. 'దేవుడా! చూడు. బాగా కన్నులు తెరిచి చూడు!! నా గతి వీళ్ళకు పట్టేటట్టు చూడు!!' అని గొణుక్కుంటూ, గొణుక్కుంటూ, కుంటుకొంటూ తిరిగి తిరిగి చూసుకొంటూ ముందుకు నడుస్తున్నాడు బిచ్చగాడు.

జాలేసింది చిట్టిబాబుకు. దేవునిమీద జాలేసింది. ఆఫీసులో తనకు పై వాళ్ళు ఇద్దరంటేయిద్దరు. ఒకరు మేనేజర్. మరొకరు ఆఫీసర్. వీరిద్దరితో వేగడానికే తనకు తలప్రాణం తోకకు వస్తూ ఉంది. పాపం! ఈ దేవుడు ఇందరితో ఎలా వేగుతున్నాడో? ఇందరి మొరలను ఎలా వింటున్నాడో? బహుశా ఈ మొరలన్నిటినీ వినివిని విసిగి వేసారి ఏమీ చేయలేని స్థితిలో నిరామయంగా నిలబడిపోయాడేమో అదే మంచిదని! ఇదంతా చూసి చూసి ఆలోచించి ఆలోచించి ఆపైన ఏడ్చేవాడు చిట్టిబాబు. కానీ ఈనాడు నవ్వుతున్నాడు. తన ఆలోచనలతో తానే తనివిదీర నవ్వుతున్నాడు!

తనివి దీర నవ్వుకొనేసరికి తేలికపడింది హృదయం. ఆలోచనలు ఆగిపోయాయి. అసలు తాను బయలుదేరింది సినిమాకన్న సంగతి గుర్తుకు వచ్చింది. అదిరిపడ్డాడు చిట్టిబాబు. అదిరిపడి అటూయిటూ చూసి అందరిలాగే ముంజేతిని చూసుకొన్నాడు– అప్పటికే ఆలస్యమైపోయిందేమో అని! అందరికీ ఉన్న గడియారం తనకు లేదు. తన ముంజేయి బోసిగా

ఉంది. నిట్టూర్చాడు చిట్టిబాబు. నిట్టూరుస్తూ అరచేతిని చూసుకొన్నాడు. అరచేతిలో గీత! అదే మారితే మొట్టమొదటిసారిగా ఓ గడియారం కొనాలనుకొన్నాడు. ఆ గడియారం అనేది లేక తాను చాల యిబ్బందిపడుతున్నాడు. చేయాల్సిన పని తాను వేళకు చేయలేకపోతున్నాడు. కొన్ని కార్యక్రమాలు వాయిదా పడుతున్నాయి. కొందరిదగ్గర మాట నిలబెట్టుకోలేక పోతున్నాడు. ఈ వేళ సినిమాకూడా ఆలస్యమైపోయేటట్లు తోచింది. సినిమా సంగతి మనసులో మెదిలేసరికి వడివడిగా నడిచాడు చిట్టిబాబు.

సినిమా హాలుముందు జనం పలచబడ్డారు. అప్పటికే ఆట ప్రారంభమైనట్లుంది. ఒకటీ అర రిక్షాలు మాత్రం అటు యిటు తిరుగుతున్నాయి. కాలు గాలిన పిల్లిలా పరుగెత్తాడు చిట్టిబాబు ఓ కౌంటరు దగ్గరికి. పరుగెత్తినవాడు పరుగెత్తినట్లుగా మరో కౌంటరు దగ్గరి కురికాడు. అక్కడి నుండి తిరుగు ముఖం పట్టాడు. కింది తరగతుల టిక్కట్లన్నీ అప్పటికే అమ్ముడు పోయాయి. సినిమా హాలు ముందు చిన్నబోయిన మొగంతో నిలుచుకొన్నాడు చిట్టిబాబు. రంగురంగుల విద్యుత్కాంతులతో చిత్రంగా వెలుగుతూ ఉంది సినిమా హాలు. అప్పుడు నడుస్తున్న చిత్రం తాలూకు అర్ధ నగ్నంగా ఉన్న చిత్రాలు హాలు ముందర అందాలు పోతున్నాయి. ఆహ్వానిస్తున్నట్లున్నాయి. తిరిగి వెళ్ళిపోవడానికి మనస్కరించ లేదు చిట్టిబాబుకు. పై తరగతి టిక్కట్టు కొందామనుకొన్నాడు. తానుకింది తరగతి మనిషి కదా? అని ఆలోచనలో పడ్డాడు. అయినా ఫరవాలేదనుకొన్నాడు. అనుకుంటూ పై తరగతి కౌంటరు వద్దకు వెళ్ళాడు. వెళ్ళి అలానే నిలబడి పోయాడు. నిలబడి అర నిమిషం చూపు నిలిపాడు. ఆ పైన నోరు తెరిచాడు!...అవూ దూడ!!........ ఎంతో ఒద్దికగా, మరెంతో ముద్దుగా, రెండు టిక్కట్లు చేతిలో పట్టుకొని ఎదురుపడ్డారు. ఎదురుపడి, నిశ్చలంగా నోరు తెరచి నిలబడి ఉన్న చిట్టిబాబును చూసి అదిరిపడి... అంతదూరం వెళ్ళి నవ్వులతో విరగబడి, ఒకరునొకరు రాచుకొంటూ సినిమా హాల్లో జొరబడి... చిట్టిబాబు కాళ్ళకు కట్టారు కట్లు. అటూ యిటు కదలలేక నిలబడిపోయాడు చిట్టి బాబు. నిలబడి ఆలోచిస్తున్నాడు.

అప్పటికి దాదాపు పది సంవత్సరాల కిందటనే తనకు ఆడదాని ఆవశ్యకత తెలిసింది. అప్పుడు తన వయస్సు పదిహేనేండ్లు. ఆ వయస్సుకే అందమైన ఆడమొగాన్ని చూడకూడ దనుకొంటూనే చూస్తున్నాడు. చూచినపుడంతా నరాలు జివ్వుమని లాగాయి. గుండెల్లో ఊహలు రివ్వుమని లేచాయి. తాను ఆ ఊహల్లో ... తీయని ఊహల్లో తేలియాడే వాడు. అది ఒక రసమయ జగత్తు. వర్ణనకు లొంగని మత్తు. దారిలో నడుస్తూ ఉంటే నడిచినట్లు ఉండేది గాదు. గాలిలో తేలిపోతున్నట్లు తోచేది. ఎండ వెన్నెలగా సేదదీర్చింది. ఆకలిదప్పులు... పాపం! అవి ఎంత మంచివి. జోలికి రానేలేదు. అలా ముచ్చటగా మూడేండ్లు గడిచింది. అంతలో అబ్బాయికి మైనరు తీరిందన్నారు. మైనరు తీరేసరికి– గున్న మామిడి పండులాంటి అమ్మాయి కాదు కానీ, గుమస్తా గిరి వరించింది. గాలికి వదిలి ఉండిన ఇంట్లో వాళ్ళు తన్నొక పెద్దమనిషి కింద జమకట్టారు. భయభక్తిగ పలకరించేవాళ్ళు. వినయవిధేయతలు ప్రకటించేవాళ్ళు. మొదట

అది చాలా చాలా తృప్తినిచ్చింది తనకు మాత్రం. అందరు తనంటే 'భయపడుతున్నారులే!' అని మురిసిపోయాడు. కానీ రానురాను ఇంట్లో వాళ్ళ మెత్తని ప్రవర్తన వెనుక దాగిన రహస్యం తెలిసిపోయింది. మెత్తగ లొంగదీసుకొని మొత్తం బాధ్యతల్ని నెత్తిన రుద్దారు. ఇప్పుడు ఇంటి అవసరాలన్నిటికీ తాను బాధ్యుడు!– ఆ గృహం! ఏ మహాపాపి అన్నాడో స్వర్గసీమ అని! వాడి నాలుక వెయ్యి ముక్కలు కావాలనుకొంటాడు చిట్టిబాబు. తెచ్చే జీతమా– చాలదు. చాలినా చాలక పోయినా బతకాలి. బతకాలి అంటే కొన్ని కనీస సౌకర్యాలన్నా కావాలి. దానికి డబ్బు కావాలి. "ఏవేళకు లేచినా రాళ్ళ కాలవ దగ్గరే తెల్లారినట్టు" ఎటు తిరిగినా అటు తిరిగినా అటూయిటు తిరిగి డబ్బు దగ్గరే తెల్లారుతూ ఉంది బతుకు. తన తెలివి తేటలను జాగ్రత్తగా లెక్కగట్టి, "ఇదో!ఇదే!ఇది తీసుకొని బతుకు. ఆపై మాట్లాడకు!... మాట్లాడితివో జాగ్రత్త!" అని తన జీవితానికే విలువ గట్టింది ప్రభుత్వం. తాను తెస్తున్న జీతాన్ని తెలుసుకొని, దానికి విలువగట్టి, "అబ్బాయి! అలా చూడు. అడక్క తినేవాడు బతుకుతున్నాడు. అందల మెక్కి తిరిగేవాడు బతుకుతున్నాడు. ఎక్కడికక్కడ తృప్తిపడాలి నాయనా! ఆశలకు అంతం ఎక్కడిది? మట్టసంగా బతకడానికి నేర్చుకో! అప్పుచేసి లేని అగచాట్లు ఎందుకు నెత్తిన రుద్దుకొంటావు? ఇదంతా నీ శ్రేయస్సు కోసమే!" అని లోకం పాఠం నేర్పింది– ఎక్కడ అప్పుకోసం తయారవుతాడేమో అని ముందు జాగ్రత్తగా! ఈ యాతన చిట్టిబాబులో ఆలోచనలు రేకెత్తించింది. అందుకే చిట్టిబాబు ఆనాటి నుండి అందమైన మొగాలను కూడ మరిచి ఆలోచిస్తున్నాడు. లోకాన్ని మరామత్తు చేయాలని ఆలోచిస్తున్నాడు.

కానీ ఈ రోజు ఆవు దూడ కంట పడ్డాయి. అందమైన ఆవు దూడ కంట పడ్డాయి. అవును దూరంగా తరిమేశాడు. దూడను నిలబెట్టి చూశాడు. పక్కనే నిలబెట్టుకొని చూశాడు. ఒడ్డు పొడుగూ, అందం చందమూ....... ముచ్చటగ ఉంది దూడ. ముద్దుగ ఉంది దూడ! దూడ వయ్యారంగా నడుస్తూంటే నడకలో అందం. ఓరగంట చూస్తే కనుకొలకుల్లో అందం. నొక్కుల జుట్టులో అందం. నవ్వితే బుగ్గ సొట్టల్లో అందం. దానిమ్మ గింజల్లాంటి పలువరసలో అందం! అబ్బ! అందం! అని ఆలోచిస్తూ గట్టిగానే అరిచాడు చిట్టిబాబు! నిక్కిచూసి, ఒంటరిగా నిలబడివున్న చిట్టిబాబును చూసి, చిటికెడు ముక్కుపొడుం దట్టింది "ఏంవండీ, ఏదో కలవరిస్తున్నట్టున్నారే! ఆట మొదలు పెట్టి అర్ధగంట దాటింది. మీరు సినిమాకు వెళ్ళరా?" అన్నాడు బుక్కింగు క్లార్కు. ఆ మాటతో అదిరిపడ్డాడు చిట్టిబాబు. అటూయిటు చూసి బోలెడంత సిగ్గు ఒలకబోసి సరాసరి కౌంటరు దగ్గరికి వెళ్ళి టిక్కెట్టు కొన్నాడు. పై తరగతి టిక్కెట్టు కొన్నాడు. ధీమాగా కొన్నాడు. ఆపై ఠీవిగా నడిచాడు చిట్టిబాబు పై తరగతికి!

అప్పటికే ఆట నడుస్తూ ఉంది. అంతసేపు వెలుగులో ఉండి హాల్లో అడుగు పెట్టేసరికి ఒక్క సారిగ అంధకారంలో మునిగినట్లయింది. ఎటు వెళ్ళడానికి తోచకుండా నిలబడ్డాడు చిట్టిబాబు. "ఇటు సార్! ఇటు!!" అంటూ ఎవరో కుర్రవాడు మినుక్కు మినుక్కు మంటున్న చేతి దీపంతో దారి చూపించాడు. అతడు చూపిన దారి వెంబడి ఓ చివరి వరకు నడిచాడు.

అతడు చూపించిన కుర్చీలో కూర్చున్నాడు. కూర్చుని నడుస్తున్న సినిమా చూస్తున్నాడు. చూస్తూ దూడను గురించి ఆలోచిస్తున్నాడు.

"బలే ఉంది గదా దూడ!" అన్నది మనస్సు.

"అబ్బ! వేరే చెప్పాలా?" బదులు పలికాడు తాను.

"అయితే ప్రేమించరాదూ!"

"అంత సులభమా?"

"కాక మరి?"

"అయితే ఆ సులభ మార్గమేదో చెప్పరాదూ! నీకు పున్నెముంటుంది!" బతిమలాడాడు తాను.

"ఏముంది? వాలకం చూస్తే కాలేజీ పిల్లలా ఉంది. ఉదయం కాలేజీకి వెళ్ళటానికి ఎటూ బస్సు ఎక్కుతుంది. సాయంత్రం కాలేజి నుండి తిరిగి రావడానికి కాలేజీలో బస్సెక్కి ఉదయం బస్సెక్కినచోటే దిగుతుంది. అంటే దినానికి ఒక్కసారి బస్సు ఎక్కుతుంది. ఒక్కసారి దిగుతుంది. ఈ రెండు పనులు జరిగేది ఒక్క చోటే! కాబట్టి ఆ చోటు పసికట్టు. పని కట్టుకొని అక్కడ నిలబడు. ఆపై ఇంటి వరకు వెంటపడు!"

"ఆ తర్వాత దవడపళ్ళు రాల్చుకో!"

"ఛీ! ఛీ! ఏమిటా మాటలు? సుద్ద దద్దమ్మలా ఉన్నావే? కొంతకాలం ఓపికగా ఆమె చుట్టు తిరుగు. ఆమె నిన్ను చూసినా నువ్వు ఆమెను చూడనట్లుగా తిరుగు. తరువాత కొంతకాలం చూసీ చూడనట్లుగా తిరుగు. అప్పుడు ఆమె నీకొక బిరుద ప్రదానం చేస్తుంది– మనస్సులోనే 'బాడీ గార్డ్!' అని. ఆపై 'అయ్యో! పాపం!' అన్న సానుభూతితో అప్పుడప్పుడు మాత్రం ఆమె నిన్ను చూస్తుంది. కొంతకాలానికి ఆ సానుభూతి అభిమానంగా మారుతుంది. అప్పటినుండి ఆమె నిన్ను చూడకూడదనుకొంటూనే చూస్తుంది. 'ఆమె నిన్ను చూస్తున్నది!' అన్న నమ్మకం కలిగిన తరువాత ఆమెను చూసి చిన్నగా నవ్వు. ఆమె తల మెల్లగా వాలిపోతుంది. అప్పుడు నీవు కాస్త బిగ్గరగా నవ్వినా ఫరవాలేదు. ఆమె మళ్ళీ ఒక్కసారి తలెత్తి చూస్తుంది. అప్పుడు మెల్లగా కన్ను గొట్టు!"

"శ్రీమద్రమారమణ గోవిందో! హరి!!" కొంప కూలుతుంది.

ఆట ఆగింది. తెరమీద 'విశ్రాంతి' అని కనబడింది. హాలంతా విద్యుత్కాంతులతో వెలిగింది. ఆలోచనలో మునిగిన చిట్టిబాబు అటు ఇటు చూసి పక్కన చూశాడు. పక్కన దూడ! ఆ పక్కన ఆవు'– దూడ చిలిపిగా చూస్తూ ఉంది తన వైపు. కుర్చీలో ఒదిగి పోయాడు. ఒదిగి కూర్చుని చూసీ చూడనట్లు చూస్తున్నాడు చిట్టిబాబు. దూడ లేచింది. దూడ వెంబడి ఆవు లేచింది. దూడ వెంబడి ఆవుగా బయటకి నడిచారు. నడుస్తూ ఉంటే చీర కుచ్చెళ్ళు తగిలాయి! ఉక్కిరి బిక్కిరయ్యాడు చిట్టిబాబు. ఉడతలా కుర్చీకి అతుక్కపోయాడు. 'కొంగు తగిలితే

మగవాళ్ళు!' పాట శ్రావ్యంగా వినిపిస్తూ ఉంది. చిట్టిబాబు ఆనందలహరిలో తేలిపోతున్నాడు. తేలిపోతూ పాటను అనుభవిస్తున్నాడు.

అయిదు నిమిషాలు గడిచింది. మసక చీకటి హాలుకు మసి పూసింది. బయటనుండి ఒక్కొక్కరుగ లోపలికి వస్తున్నారు. వచ్చి వాళ్ళ వాళ్ళ కుర్చీల్లోనే కూర్చుంటున్నారు. ఆవు వెంబడి దూడగా లోపలికి వచ్చారు. సంగీత రసాస్వాదనలో మునిగిన చిట్టిబాబు కుర్చీకి చేరగిలబడి కాళ్ళు బారసాచి ఉన్నాడు. ఆవు జాగ్రత్తగా దాటుకొనింది. దూడ దాటుకొనే టప్పుడు కాలు తగిలింది. 'సారీ!' అనింది దూడ ముద్దుగా. ఎగిరిపడి కుర్చీలో నిటారుగ కూర్చున్నాడు. కూర్చున్నా మెలికలు తిరిగిపోతున్నాడు చిట్టిబాబు. ఏదో బదులు చెప్పాలని చెప్పలేక పోతున్నాడు. "అయ్యో! పిచ్చి సన్నాసీ! ఇంతటి అపూర్వావకాశాన్ని జారవిడిస్తే ఎలా?... మళ్ళీ రమ్మంటే వస్తుందా? ఊc! కానీ అదో! కాఫీ అమ్ముతున్నారు చూడు. ఇదో! ఈ అబ్బి చాక్లెట్లు కొనమంటున్నాడు చూడు. మూడు కాఫీ... ఆరు చాక్లెట్లు... ఊc! అర్డ రివ్వు! త్వరగా!"....

"ఆర్డరైతే ఇస్తాను. కానీ అవి వాళ్ళకు ఇచ్చేదెలాగూ అని?"

"ప్రతి దానికి ఇలా నంజితే ఇక తెల్లారినట్టే!... మొదట కాస్త బెట్టు చూపిస్తారు. నువ్వు మాత్రం పట్టు వదలద్దు. 'ప్లీజ్! ప్లీజ్!' అని రెండంటే రెండుసార్లు అను. అంటున్నప్పుడు కాస్త దీనంగా మొగంపెట్టు. అంతే! చచ్చినట్లు తీసుకొంటారు. కాఫీ తాగుతూ మాట కలుపు. చాక్లెట్లు చప్పరిస్తూ వాళ్ళని కొనియాడు–చాలు. నువ్వు అగ్రశ్రేణి ప్రేమికుడవై పోతావు."

"నిజంగానా?"

"ప్రయత్నించి చూడరాదూ! నీకే తెలుస్తుంది."

"ఏ మొనబ్బా! నాకేమో భయంగా ఉంది."

"అయ్యో! పిరికి సన్నాసీ! 'ఆలస్యం అమృతమ్ విషమ్!' ఊc!కానీ!"

తొందర పెడుతూ ఉంది మనసు. ఎంత ప్రయత్నించినా గొంతు పెగల్లేదు. అటు ఇటు చూస్తాడు. కాఫీ అమ్ముతున్న వాణ్ణి చూస్తాడు. చాక్లెట్ల అబ్బిని చూస్తాడు. ఆపై దూడను చూస్తాడు. 'గుడగుడ' అంటుంది గుండె. అంతటితో ఆగిపోతాడు. కానీ చిట్టిబాబు కోసం సినిమా ఆగలేదు. సినిమా అయిపోయింది. పాపం! చిట్టిబాబును ఆ అవస్థలోనే నిలిపి సినిమా అయిపోయింది. అందరూ ఓ ప్రవాహంలా హాలు బయటపడ్డారు. చిట్టిబాబు కూడ పడ్డాడు దూడ వెంట!–

తిధి వారం నక్షత్రం చూడలేదు చిట్టిబాబు. మంచి లగ్నంకోసం మంతనాలు జరపలేదు. అయినా ఆ 'వెంటపడు' ప్రారంభోత్సవం మంచి లగ్నంలోనే జరిగినట్లుంది. అయిదేండ్లు నిర్విఘ్నంగా కొనసాగింది ఆ వెంటపడడం.

సాధారణంగా ఎనిమిది గంటలప్పుడు మునిసిపాలిటీ సైరను మేలు కొలుపులు పాడేది చిట్టిబాబుకోసం! ఆ పైన మగత నిద్రలో మరో అరగంట పడకమీద పది దొర్లుతాడు. తరువాత

లేస్తాడు. లేచి పక్క ఇంట్లో 'గంట ఎంత?' అని అడిగిస్తాడు. 'తొమ్మిదింబావు' అని బదులు వస్తుంది. అంతే! అదరాబాదరా మొగం కడగతాడు. ఓపిక ఉంటే స్నానం. లేదంటే అదీలేదు. ముంగాళ్ళమీద పరుగులు తీస్తే అప్పటికే పావుగంట ఆలస్యమయ్యేది. మేనేజరుగారి వడ్డింపుతో పని ప్రారంభమయ్యేది. కానీ అయిదేండ్లలో అయిదు గంటల తరువాత ఎన్నడూ నిద్ర ఎరగడు చిట్టిబాబు!

అయిదు గంటలకు నిద్ర లేచి చిట్టిబాబు ఆరు గంటలకు ఇల్లు కదులుతాడు. ఈ గంట వ్యవధిలో ఉన్న రెండు జతల బట్టల్లో మాసిన జతను ఉతకడం... ఉతికిన జతబట్టల్ని చెంబిస్త్రీ చేయడం కాలకృత్యాలు తీర్చుకోవడం చేస్తాడు. ఆరు గంటలకు ఇల్లు వదలిన చిట్టిబాబు ఏడు గంటలకు 'బస్ స్టాప్' దగ్గర చేరతాడు. చూపు దూరంలో నిలబడతాడు. నిలబడి దూదను గురించి ఆలోచిస్తాడు. ఆలోచిస్తూ ఎదురు చూస్తాడు.

దూద వస్తుంది. చిట్టిబాబు ఎదురుతెన్నులు కాస్తున్నాడని కాదు. కాలేజీకి వెళ్ళడానికని వస్తుంది. వస్తూ ఉంటే నడకనాణ్యాలు దిద్దుకొంటుంది. రాజహంస పాఠాలు నేర్చుకొంటుంది. చిట్టిబాబు గుండె ఆనందాలు చేర్చుకొంటుంది. అంతకు మునుపే ఆ 'బస్‌స్టాప్' కన్నెపిల్లల కలకలంతో నిండి ఉంటుంది. ఆమె రాకతో అందరు ఆమెను చూసి చిరునవ్వులు కురిపిస్తారు. ఆమె కూడ నవ్వుతుంది. నవ్వుతూ వాళ్ళల్లో కలిసిపోతుంది. కలిసిపోయినా చుక్కల్లో చంద్రవదనే!

చూస్తూ నిలబడతాడు చిట్టిబాబు. నిలబడి ఆలోచిస్తాడు. అక్కడ గుమిగూడిన అందరిలో ఒక్కొక్కరిలో ఒక్కొక్క ప్రత్యేకత ఉంది. ఒక పిల్లకు ముక్కు అందం. మరో పిల్లదానికి పలువరుస అందం. ఇంకో జవరాలికి నొక్కులు తిరిగిన పొడుగాటి వెంట్రుకలు అందం. ఒక తరుణికి కటిస్థలి అందం. మరొక మగువకు వక్షస్థలి అందం! ఇలా యిలా ఎన్నెన్నో ప్రత్యేక అందాల సమ్మేళనమే దూద అని తలపోస్తాడు చిట్టిబాబు. అక్కడ ఉన్న అందమంతా దూదలోనే ఉందని అభిప్రాయపడతాడు చిట్టిబాబు. అందుకే అందరిలో ఆమెనే చూస్తూ నిలబడతాడు చిట్టిబాబు!–

బస్సు వస్తుంది. వచ్చి నిలబడుతుంది. నిలబడిందే తడవుగ తోచుకుంటూ తొక్కుకుంటూ, బస్సులో పడడానికి అందరు ప్రయత్నిస్తారు– కాస్త ముందయితే హాయిగా కూర్చొనేదానికి స్థలం దొరుకుతుందేమో? అని అందరి తాపత్రయం. ఆ తాపత్రయంలో సభ్యతమరిచి పోతారు. ఒక్కొక్క రోజు ఆ తోచులాటలో 'దూద' అందరి మధ్యపడుతుంది. పడి నలిగి పోతుంటుంది. ఆమె అలా నలిగి పోతుంటే చిట్టిబాబు గుండె చివుక్కుమంటుంది. ఒక్కొక్కరిని వడిసిపట్టుకొని రబ్బరు బంతిలా ఆమడల దూరానికి విసిరి పారేయాలనుకొంటాడు. అనుకొంటూ ఆమెను చూస్తాడు. అప్పటికే ఆమె అందరి మధ్య దబ్బలా అయిపోతూ ఉంటుంది. "అయ్యో! ఆమె ఒంటి నిండుకూ ఉన్న వంపులు చదరమై పోతున్నాయే!' అని వాపోతాడు. వాళ్ళు బస్సు ఎక్కి కూర్చున్నా చిట్టిబాబు నిలబడి వాపోతూనే ఉంటాడు. బస్సు వెళ్ళిపోతుంది. దూదను మోసుకొని పోతున్న బస్సు చిట్టిబాబు గుండెల్ని కూడ మోసుకొనిపోతుంది.

ఇప్పుడు గుండెలు లేని 'ఏన్జీవో' చిట్టిబాబు. తన 'ఎన్జీవో' పదవికి నిజంగా గుండెలు అవసరమే లేదు. గుండెలున్నవాడు గుట్టుగ ఉండలేడు. ఆ గానుగెద్దు జీవితం గడపలేడు. అందుకే ఇంటికంటే గుడి భద్రమని చిట్టిబాబు ఆఫీసుకు బయలుదేరతాడు. ఆఫీసు ఇల్లు అనుకొని అక్కడే కాపురం పెట్టిన మేనేజరు చిరునవ్వుతో ఆహ్వానిస్తాడు చిట్టిబాబును. "ఇలా అయితే నువ్వు తప్పకుండా బాగుపడతావు. నీకెంతో ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఉంది. ఇంకా కాస్త ముందుగా రావడానికి అలవాటు చేసుకో! డబ్బేముంది నాయనా?... వెధవది! వస్తుంది. పోతుంది. పేరు సంపాందించాలి. మంచిపేరు సంపాదించాలి. తెలిసిందా?" అని కన్నులతోనే ఆశీర్వదిస్తాడు. ఈ అయిదేండ్ల కాలంలో అంతకంటే ముందు ఆఫీసుకు వెళ్ళలేకపోయాడు చిట్టిబాబు. అందుకే బాగుపడలేక పోయాడు.

నిర్ణీత కాలంలో తూర్పున పుట్టి పడమటనే కుంకుతాడు అనుకొనే సూర్యుడు కూడ అయన భేదంతో కొన్ని నిముషాలు అటోయిటో అవుతున్నాడు. 'నా హయాంలో రైళ్ళన్నిటినీ సకాలములో నడిపిస్తాను. లేదా నేనే రాజీనామా చేస్తాను!" అని సగర్వంగా చాటుకొన్న మంత్రివర్యుని మాటలు రైలు చక్రాల వేగాన్ని ఇంకా కాస్త తగ్గించాయి– నిదానమే ప్రధానమని! రైళ్ళు సకాలంలో రాలేదు. మంత్రివర్యుడు రాజీనామా చేయలేదు. ఎంతో శాస్త్రీయ దృక్పథంతో, మరెంతో నైపుణ్యంతో తయారుచేసిన రోదసీ నౌకలు చరిత్రను సృష్టించిన వ్యోమగాములు ఒకేఒక్క చిన్న తప్పుతో దారులు తప్పి మహావీరుల ప్రాణాలు బలి అవుతున్నాయి. కానీ ఈ అయిదేండ్లలో చిట్టిబాబు మాత్రం 'బస్ స్టాప్'కు చేరడం అర నిముషం అటుయిటూ దాటలేదు.

ఓ రోజు సాయంకాలం. సందడిగావున్న బజార్లో ఆలోచిస్తూ నడుస్తున్నాడు చిట్టిబాబు. దూడనుగురించి ఆలోచిస్తూ నడుస్తున్నాడు. నడుస్తూ అటూయిటు చూస్తున్నాడు. చూస్తూ నిలబడిపోయాడు. నిలబడి నిదానించి చూశాడు. సందేహంలేదు. నిజంగానే దూడ!... ఆవు వెంటలేని దూడ!!– ఓ బట్టలకొట్టు మెట్లమీద నుండి దిగుతూఉంది వయ్యారంగా. చేతిలో పొట్లం ఉంది. బట్టలకొట్టు పక్కన కిరాణా కొట్టుముందు కూర్చొని పకోడీలు నములుతున్న గుప్త అదోరకంగా చూస్తున్నాడు దూడవైపు. ఆ గుప్తగారి పొట్టనుకాదు కానీ, ఈ సారి కండ్లను చిత్తుచిత్తుగ పొడిచేయాలనుకొన్నాడు చిట్టిబాబు! దూడ బట్టలకొట్టు మెట్లు దిగింది. మెట్లుదిగి కొట్టుముందు నిలబడింది. నిలబడి అటుయిటూ చూసింది. రిక్షా కోసమేమో అనుకొన్నాడు. ఆ పైన తనవైపు చూసింది. మెల్లగా నవ్వాడు తాను. ఆమెకూడ సన్నగా నవ్వింది. 'దూడ నవ్వింది! దూడ నవ్వింది!!' అని ఎగిరెగిరిపడ్డాడు చిట్టిబాబు. ఆ తర్వాత తనవైపు చూసింది. మెల్లగా తల ఆడించాడు రమ్మని పిలిచినట్లు. కాసేపు తీక్షణంగా చూసింది దూడ. వణికిపోయాడు చిట్టిబాబు. 'ఎందుకొచ్చిన గొడవ?' వెళ్ళదామనుకొన్నాడు. తాను బయలుదేరేసరికి దూడకూడా బయలుదేరింది. దూడ బయలుదేరేసరికి చూస్తూ తాను నిలడిపోయాడు. వెళ్ళడానికి బయలుదేరిన దూడ నేరుగా తాను నిలబడినచోటికే వచ్చింది. వచ్చి ముద్దుగా నవ్వింది. తాను నవ్వాడు. ఇప్పుడు దూడ పక్కన చిట్టిబాబు ఉన్నాడు. చిట్టిబాబు

పక్కన దూడ ఉంది. ఒకరి నొకరు చూసుకొన్నారు. చూసుకొంటూ నవ్వుకొన్నారు. నవ్వుకొంటూ బజారు వైపు చూశారు. బజారంతా తమవైపే చూస్తూఉంది. చూస్తూ అసూయపడినట్లుంది. అసూయ! అది ఆంధ్రులకు ఒంటపుట్టిన రోగమేకదా? అనుకొన్నారు. గర్వంగా బజార్లో నడుస్తూ ఉన్నారు. ఒకరి ప్రక్కన ఒకరుగా నడుస్తున్నారు. 'ఆవు దూడ' నడిచినట్లు నడుస్తున్నారు. నడుస్తూ ఉంటే- వాళ్ళ గుండెలనిండుకు ఆనందం. వాళ్ళ తలలనిండుకు ఆలోచనలు. ఆనందలహరిలో తేలిపోతున్నారు. తేలిపోతూ రోడ్డుమీదనే నడుస్తున్నారు. ఊరి పొలిమేరలవరకు నడిచారు. విశ్వవిద్యాలయ భవనాలు దాటి నడిచారు.

అక్కడ నిలబడ్డారు. నిలబడి చూశారు. అంతా మైదానం. ఆ మైదానంలో విసిరిపారేసినట్లు అక్కడక్కడ పెద్ద పెద్ద భవనాలు. మిగత ప్రదేశ మంతా చిట్టి పొట్టి పొదలు. ఆ పొదలమీద కిచకిచలాడుతూ ఉల్లాసంగా ఎగురుతున్న పిట్టలు. దీనికంతటికి బంగారు పూతపూసి రామణీయకతను చేకూర్చడానికి ప్రయత్నిస్తున్న సంజవెలుగులు. ఆ వెలుగులను కబళించడానికి తయారవుతున్న చీకటిదెయ్యం. అందంగా ఉంది ఆ ప్రదేశం. ఆ అందాన్ని అనుభవిస్తూ ఒకరినొకరు చూసుకొన్నారు. ఒకరినొకరు చూసుకొంటూ నవ్వుకొన్నారు. నవ్వుకొంటూ ఒకరి వెంబడి ఒకరు నడిచారు.

ఆ మైదానంలో ఆ చిట్టిపొట్టి పొదలమధ్య ఓ వంక. రాళ్ళు రప్పలతో నిండిన వంక. అక్కడక్కడ ఇసుకతిన్నెలు గల వంక. ఓ ఇసుకతిన్నెవద్ద నిలబడ్డారు ఇద్దరు. నిలబడి కలయచూశారు. నిర్మానుష్యంగా ఉంది మైదానం. ధైర్యంగా ఆ ఇసుకతిన్నెల మీద కూర్చున్నారు. కూర్చొని ఇసుకను కుప్పలుతోస్తూ ఉంది దూడ! ఇసుకలో గీతలు గీస్తున్నాడు చిట్టిబాబు. గీతలు గీస్తూ ఆమెను చూస్తున్నాడు.

దూడ తల వాలిపోయింది ఇసుక కుప్పలు తోయడంలోనే నిమగ్నమైనట్లు! చిరునవ్వుల్ని పెదాలు బిగపట్టుతున్నాయి. కోరికలు కనుకొలకులకు కాంతినిస్తున్నాయి. బరువుగా సాగుతున్న శ్వాసక్రియ వక్షస్థల వంపులకు ఇంపు చేకూరుస్తూ ఉంది. సంజవెలుగులు ఆమె అందానికే అందాన్నిస్తున్నాయి.

మాట్లాడాలని తపన. మాటలు పెగిలిరాని అశక్తత. నండూరి వారన్నట్లు గుండె గొంతుకలో కొట్లాడుతూ ఉంది. ఆ ఆరాటంలో ఒకచోట కుదురుగ కూర్చోలేక పోతున్నాడు. ముందుకు జరగలేకపోతున్నాడు. ఎలాగో నిబ్బరించుకొని మెల్లగ గొంతు సవరించుకొన్నాడు. మెల్లగా తిరిగిచూసింది. దూడ!- ఆమె అలా ఓరగంట చూస్తే- కనుకొలకులు చిలిపిగా నవ్వుతున్నాయి. విప్పారిన పెదవులు నవ్వుతున్నాయి. అరుణరాగరంజితాలైన బుగ్గలు నవ్వుతున్నాయి. తలలో పూవులు నవ్వుతున్నాయి. గాలికి రేగిన ముంగురులు నవ్వుతున్నాయి.

ఎంతో మాట్లాడాలనుకొన్నాడు చిట్టిబాబు. ఏమీ మాట్లాడలేకపోతున్నాడు చిట్టిబాబు.

"మీకు పాటలు వచ్చా!" ముద్దుగా అడిగింది దూడ.

"ఓ!" అన్నాడు తాను.

"అయితే ఓ పాట పాడండి!"

తొలి రోజు. దూడను మొట్టమొదటిసారిగా సినిమాహాల్లో చూసినరోజు. తిథి వారం నక్షత్రం చూసుకోకుండా వెంటపడిన రోజు! – పడకమీదపడి దొర్లుతూ నిద్రరాక ఏమీ తోచక దూడను మరవలేక రాత్రంతా జాగరణ చేసిన రోజు! తాను రాసుకొన్న పాట! తనకు ఇష్టమైన పాట!

గుండెల్లో గుడి కట్టితీ....... ఓ చెలియ
గుడిలోన నిను నిల్పితీ
కన్నీటితో కడిగితీ
పాదాలు ఓ చెలియ! కరుణించమని వేడితీ
కోరికలు వడపోసితీ!... ఓ చెలియ!
క్రొత్త ప్రమిదెలోన నింపితీ
అనురాగమే వత్తిగా!..... ఓ చెలియ
ఆశాజ్యోతినే వెలిగించితీ.......

భావాలు కలవోసితీ!... ఓ చెలియ!
భావసుమమాలనే కట్టితీ!
గళసీమలో నిల్పితీ!... ఓ చెలియ
గళమెత్తి నే పాడితీ!.....

"అబ్బ! ఎంత బాగుందండీ!" మురిసిపోయింది దూడ. ముగ్ధురాలై పోయింది దూడ. ముందూవెనుక చూడకుండా ముద్దుపెట్టింది దూడ. ముద్దుపెట్టుతూ అమిత గాఢంగా కౌగలించుకొనింది దూడ. "ఆహా! ఓహో!" అన్నాడు చిట్టిబాబు. వీపు 'ఛళ్ళు' మనింది. ఎగిరిపడ్డాడు చిట్టిబాబు.

"ఏమిత్రా బాబూ! నడివీధిలో నిలబడి కలలుగంటున్నావే? – రోజులు బాగలేదు నాయనా! ఎక్కడ చూసినా ఏదో ఘోరం జరుగుతూనే ఉంది. ఈ మోటార్లకు కార్లకు లారీలకు కళ్ళు తెరిచి నడవండి అని చెప్పే పోలీసువాళ్ళ చొక్కాలకు నిక్కర్లకు లెక్కలేనన్ని జేబులు కుట్టిచ్చింది ప్రభుత్వం. నువ్వే చెప్పు అవి ఖాళీగా ఉంటే వాటి ప్రయోజనం దెబ్బతిన్నట్లే గదా? – కాబట్టి మన జాగ్రత్తల్లో మనం ఉండడం మంచిది. అయినా నా వెర్రి కానీ, నీలాంటి నాలాంటి ఎన్జీవోలు ఉండిన ఊడినా కాబట్టిందెవుడికి! నే వస్తా!" అంటూ వెళ్ళి పోయాడు మిత్రుడొకడు. ఈ లోకంలో పడ్డాడు చిట్టిబాబు. వెంటనే ఎదురుగా ఉన్న బట్టల కొట్టు తట్టు చూశాడు. దూడ అక్కడలేదు! – సిగ్గుపడిపోయాడు చిట్టిబాబు! చిన్నగా ముందుకు సాగాడు చిట్టిబాబు!.....

ఒకనాటి ఉదయం. ఆఫీసుకు వెళ్ళుతున్నాడు చిట్టిబాబు. దూడతో కలసి వెళ్ళుతున్నాడు. దూడతో మాట్లాడుతూ నడుస్తున్నాడు.

"నేను ఒకరిని ప్రేమించానండి!" నంగిగా పలికాడు చిట్టిబాబు.

"ఒకరినేం ఖర్మ! ప్రేమమయం జగత్సర్వం. ప్రేమించండి. మీకు ఇష్టమైన వాళ్ళనంతా ప్రేమించండి. భావ స్వాతంత్ర్యం, వ్యక్తి స్వాతంత్ర్యం ఉన్న దేశంలో ప్రేమ స్వాతంత్ర్యం లేకపోతే ఎలా?" ధైర్యం చెప్పింది దూడ.

"అదేందండీ అలా అంటారు? నాది ఒకే గుండె. అందులో ఒకరికే స్థానం. మీరేదేదో అంటున్నారే!" బుంగమూతి పెట్టాడు చిట్టిబాబు.

"అయితే మీరు చాల మంచివారన్నమాట!"

ఉబ్బిపోయాడు చిట్టిబాబు. ఊరబెట్టిన ఉద్ది పప్పులా ఉబ్బిపోయాడు. మాటలు రాక తబ్బిబ్బులయ్యాడు.

"ఆగిపోయారేం?" ప్రశ్నించింది దూడ.

"మరి..... మరి......నేనేమో ప్రేమించానండీ! ప్రేమించిన దానికి ఫలితంగా కొన్ని ఏండ్లుగా ఆమె చుట్టు తిరుగుతున్నాను. కానీ... కానీ... ఆమెను అడగలేక పోతున్నానండీ!!"

"ఏమని?"

"ఆమె కూడ నన్ను ప్రేమించిందా? లేదా అని."

"అక్కడే పొరపాటు పడుతున్నారు. మీరు ఎప్పుడూ ప్రశ్నించరాదు."

"మరి నాకెలా తెలుస్తుంది?"

"ప్రశ్న ఉన్నప్పుడు తప్పక దీనికి సమాధానం గూడ ఉండి తీరుతుంది. కాబట్టి ప్రశ్న వేసినపుడు సమాధానం తప్పక దొరుకుతుంది. కానీ మీరు ప్రేమించిన వ్యక్తి మాత్రం మీకు దొరకక పోవచ్చు!"

"అంటే?"

"అంటే– మీరు ప్రేమించిన వ్యక్తి దగ్గరకు వెళ్ళి 'నేను మిమ్మల్ని ప్రేమించాను' అని అంటే, ఆమె 'నేను మిమ్మల్ని ప్రేమించలేదు' అని అంటుంది. అప్పుడు ఏం చేస్తారు?"

"ఏం చేయాలి?"

"పిచ్చి సన్నాసీ!– అందుకే ప్రశ్న వేయకుండా పరిస్థితులనే కల్పించాలి. నువ్వు ప్రేమించిన వ్యక్తి ఆ పరిస్థితుల్లో ఇరుక్కొని నిన్ను ప్రేమించి తీరాలి!"

"పరిస్థితులు... అబ్బ.... మాటలా?"

"మరి! ప్రేమంటే!... ఆటలా?"

ఎంత బాగ చెప్పింది దూడ! ఎగిరి గంతేశాడు చిట్టిబాబు. 'అద్భుతంగా చెప్పారండీ!' అంటూ ఆమె చేతిని వడిసిపట్టుకొన్నాడు. చేతిలో చేయి కలిపి ఆమె తెలివితేటలను అభినందిస్తున్నాడు చిట్టిబాబు. చెంప 'ఛళ్ళు!' మనింది. కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. చేతిలో చేయి వీడిపోయింది.

"బ్రూట్! బుద్ధుందా నీకు? లేదు- పిచ్చి పట్టిందా?" దారిన పోతున్న ఎవరో నవనాగరీకురాలు రొప్పుతూ ఉంది రోషంతో. అప్పటికే అక్కడ ఆయాచితంగా తయారైన బుద్ధిమంతులు నానా మాటలు అంటున్నారు కోపంతో. తల కొట్టేసినట్లయింది చిట్టిబాబుకు.

"క్షమించండీ!... ఏదో పరధ్యానంగా... క్షమించండి... మిత్రునితో మాట్లాడుతున్నట్టు... క్షమించండి... పొరపడ్డాను క్షమించండి!...." అంటూ వడివడిగా వెళ్ళిపోయాడు చిట్టిబాబు. వెకిలిగా నవ్వుతూ బుద్ధిమంతులు అదోలా చూస్తున్నారా నాగరీకురాలిని క్రాపులు, కాలర్లు సర్దుకొంటూ! 'ఛీ ఛీ! వీళ్ళకంటే కపిల తీర్థంలో కోతులు మేలు!' అనుకొంటూ వెళ్ళింది ఆ సుందరి. ఆ మాటలు ఎవరిని ఉద్దేశించి అనిందో తెలియకుండా ఒకరి మొగం ఒకరు చూసుకొంటున్నారా బుద్ధిమంతులు!

దూడ వెంటపడ్డ ఈ అయిదేండ్లలో అద్భుతమైన అనుభవాలివి. ఊహాలోకంలో విహారాలివి. అందుకు తగ్గట్టుగ వడ్డింపులుకూడ తక్కువ లేదు! ఒక సారి ఆఫీసులో అవసరమైన ఉత్తరానికి అత్యవసరంగా బదులు రాయమన్నారు. రాస్తూ కూర్చున్నాడు చిట్టిబాబు. గంటలో పూర్తి కావలసిన పని. రెండుగంటలైనా పైకి లేవలేదు చిట్టిబాబు. మేనేజరే లేచి రావలసి వచ్చింది. వచ్చిచూసిన మేనేజరుగారికి పిచ్చెక్కిపోయింది. చిట్టిబాబు చేతిలో కాగితం పెరుక్కొన్నాడు. పెరుక్కొని అందరికీ చూపించాడు. చూపిస్తూ నోటికివచ్చినట్లు తిట్టాడు. ఆ కాగితంమీద రాత! 'దూడ!... దూడ!... దూడ!...' అన్న రాత. ఎవరికీ ఏమీ అర్థంకాలేదు. ఏమిటిది? అని అడిగితే చిట్టిబాబు బదులు చెప్పలేదు. అది అతని తలరాత అన్నారు ఎవరో నవ్వుతూ.

ఈ అయిదేండ్లలోనే బాంగ్లాదేశంలో కల్లోలం జరిగింది. అక్కడ మానవత్వానికి మారణహోమం జరిగింది. మనుషులు మనుషుల్నే చంపుకొన్నారు. మానవభంగాలు జరిగాయి. 'రక్షించండి! రక్షించండి!!' అని బతిమాలుతూ ఆ దేశంలో ప్రజలు ఎలుగెత్తి ఏడ్చారు. ఆ భీభత్సాన్ని కరుణామయంగా చిత్రించాయి పత్రికలు. కాఫీ 'సిప్' చేస్తూ సిగరెట్టు పీలుస్తూ నిద్రలేచీ లేవడంతోటే అందరు ఆ వార్తలను చదివారు. 'అయ్యో! పాపం!' అన్న సానుభూతితో అక్కడే మరిచిపోయారు. బాంగ్లాదేశవాసుల ఆర్తనాదాలు గాలిలో కలిసి పోయాయి. అలనాడు జంతువుల మొరలను విన్న దేవునికీనాడు మనుషుల మొరలు చెవికెక్కలేదు. అయితే ఈనాటి మనుషులకంటే ఆనాటి జంతువులే మేలేమో?

బాంగ్లాదేశంలో కల్లోలం జరిగితే ఆంధ్రదేశంలో సమ్మె జరిగింది. చరిత్రను సృష్టించే సమ్మె జరిగింది. సమ్మె చేసినవాళ్ళు 'బంద్' జరిపారు. ప్రభుత్వం కన్నెర్రజేసింది. పోలీసులు అమాయకుల రక్తాన్ని జుర్రుకొన్నారు. ఇంత జరిగింది. మనిషి మనిషిలో రక్తం మరిగింది. దూడ మాయలో పడిన చిట్టిబాబుకు మాత్రం చీమకుట్టినట్ల నిపించలేదు.

"ఎన్జీవోలు ఎందుకు సమ్మె చేయాలి? సమ్మె అంటే అర్థమేమి? అర్థం తెలియదు. ఆలోచనలేదు. అనర్థాలుమాత్రం బోలెడు. పోనీ, ఇది ప్రజాస్వామ్యమా? ప్రజాస్వామ్యంలో వీళ్ళు నిజంగా మనుషులే అయితే ఎందుకు వీళ్ళను జంతువులమాదిరి కాల్చి చంపుతున్నారు?

అంటే! మనుషులు మనుషుల్నే కాల్చి చంపుతున్నారన్నమాట. కొందరు చస్తూంటే కొందరు మిద్దెలమీద మేడలమీద నిలబడి వేడుక చూస్తున్నారే! వీళ్ళు ప్రజలేనా? ఇది ప్రజాప్రభుత్వమా? - బాంగ్లా దేశంలో కల్లోలమేమి? బజార్లో ఈ అలజడి ఏమి? .....” ఇలా బీరకాయ పీచులా సాగిఉండేవి చిట్టిబాబు మెదడు మొదళ్ళలో ఆలోచనలు. కానీ దూడ మాయలో పడ్డాడు. దూరమయింది లోకం పోకడ. అరచేతిలో గీత చూసుకొని అయిదేండ్లు అయింది.

అయిదేండ్ల తరువాత ఓ రోజు. ఓ మిత్రుడు తేనీటి విందుకు పిలిచాడు చిట్టిబాబును. ఆ మిత్రుడు కలిగిన ఇంటి బిడ్డ. ఆ కలిగిన ఇంటి బిడ్డ లేమిలో ఉన్న ఓ భామను ప్రేమించాడు. ప్రేమా లేదు గీమా లేదు అన్నారు పెద్దలు. ‘ఉంది’ అన్నాడు తాను. ‘కాదంటే? అవునంటావా? అన్నారు వాళ్ళు. ‘అవును!’ అన్నాడతడు. ‘అయితే ఇక నీ దారి నీది! మా దారి మాది!!’ అన్నారు పెద్దలు. ‘కడకు అందరిదీ ఒకటే దారి!’ అని నవ్వాడు తాను. దానికి ‘విప్లవాత్మకమైన పెండ్లి’ అని పేరు పెట్టాడు. ఆ లేమిలో ఉన్న భామను నలుగురి మిత్రుల మధ్య నిలబెట్టి బొట్టు కట్టాలను కొన్నాడు. దానికి తేనేటి విందు జత కలిపాడు. అందుకే అందరి మిత్రులను అక్కడ చేర్చాడు.

ఆ మిత్ర బృందంలో అబ్బాయి తరపున వచ్చిన వాళ్ళల్లో చిట్టిబాబు ఉన్నాడు. అమ్మాయి తరపున వచ్చి వాళ్ళల్లో ‘దూడ’ ఉంది.

పెండ్లి జరిగింది. విప్లవాత్మకమైన పెండ్లి బొమ్మల పెండ్లిలా జరిగింది. విందు జరిగిన తరువాత నూతన వధూవరులను కూర్చోపెట్టి చుట్టూ అందరు కూర్చున్నారు. కూర్చుని కాసేపు కబుర్లలో పడ్డారు. ఆ పై అందరి దృష్టి సంగీతం మీదికి మళ్ళింది. పాట పాడడానికి కాసేపు నువ్వంటే నువ్వని పోటీ పడ్డారు. తరువాత ఆడవాళ్ళ వైపు దూడ, మగవాళ్ళ తరపున చిట్టిబాబు పాడాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ ఏకగ్రీవ తీర్మానాలను అన్నిటి కంటే బాగా నేర్పింది మన ప్రభుత్వం కాబట్టి!

దూడ పాడింది. కమ్మగా పాడింది. నెమ్మదిగా పాడింది. తలవంచుకొని ముసిముసిగా నవ్వుకొంటూ, ‘తోటలో నా రాజు తొంగి చూచెను నేడు!’ అన్నపాట పాడింది. అదొక తోటయితే ఆ తోటలో చిట్టిబాబు ఒక రాజుగా వివశుడైపోయాడు. తేనీటి విందుకు ఆహ్వానించిన మిత్రుణ్ణి కోటిసార్లు అభినందించాడు మనసార మనస్సులోనే!

“ ఈమె పేరు గీత. బి. ఎ. చదువుతూ ఉంది. తెలుగు సాహిత్యం మీద మంచి అభిలాష. ఈ నాడు వెలువడుతున్న నవలలన్నిటినీ ఒక్క గుక్కలో చదివింది!”

మిత్రబృందానికి పరిచయం చేశారు ఆమెను!

‘నమస్తే!” అని అందరికీ నమస్కరించింది గీత.

దూడ. కాదు గీత నమస్కరించిందనుకొన్నాడు చిట్టిబాబు. ఆమెకు వినయంగా వంగి నమస్కారం చేశాడు!

చిట్టిబాబు వంతు వచ్చింది. గొంతు సవరించుకొన్నాడు. అందరి వైపు ఒక్కసారి కలయచూశాడు. ప్రత్యేకంగా గీతవైపు చూశాడు. హాయిగా ఆలాపించాడు.

ఆ గడియ ఒక గడియ
అపురూపమౌ గడియ
ఆరాధ్య దైవతము
అవతరించిన గడియ......ఆ గడియ॥
కనుగొనల పొంగినవి
కలత కోరికలు
మదినిండ విరిసినవి
మధురమౌ భావనలు.....ఆ గడియ॥
నా భావ సుమముల
నావ నిర్మించుకొని
జిలుగు పయ్యెదనేమొ
తెరచాప దించుకొని
దూరాతి దూరముల
తీరముల విహరించ
మనసు పొంగిన గడియ
మధురమౌ ఆ గడియ.....ఆ గడియ॥

చిట్టి బాబు పాట పాడాడు. అనుభవిస్తూ పాడాడు. అందరూ ఆశ్చర్య పడేటట్లు పాడాడు!

"ఇతని పేరు చిట్టిబాబు. చక్కని ప్రణయగీతాలు రాస్తాడు. ఇతని కవిత్వాన్ని కంఠ మాధుర్యాన్ని ఇప్పుడు మీరు చవి చూశారు!"

సిగ్గుపడుతూ అందరికీ నమస్కరించాడు చిట్టిబాబు. అందరికీ నమస్కరిస్తున్నా అతని చూపులు గీతమీదనే! మరో లోకంలో ఉన్నట్లు ఆమెను ఊహించుకొని మురిసి పోయాడు చిట్టిబాబు. అందరు బయలుదేరుతున్నారు. బయలుదేరుతూ ఒకరి వద్ద ఒకరు సెలవు తీసుకొంటున్నారు. గీత చిట్టిబాబును సమీపించింది.

"మా ఇల్లు......"

"నాకు తెలుసునండీ!"

"మీకెలా తెలుసు?" ఆశ్చర్యం ధ్వనించింది గీత మాటల్లో.

తల వంచుకొన్నాడు చిట్టిబాబు. కొత్త పెళ్ళికూతురిలా తలవంచు కొన్నాడు. అయిదేళ్ళు ఇంటి చుట్టు తిరిగానని చెప్పలేక తల వంచుకొన్నాడు.

"పోనీలెండి! కారణాలతో అవసరమేముంది? అప్పుడప్పుడు మా ఇంటికి వస్తూ ఉండండి!" ఆహ్వానించింది గీత.

తల ఆడించాడు చిట్టిబాబు మంచి అబ్బాయిలాగ. గీత వెళ్ళిపోతూ ఉంది. ఆమె వెళ్ళిపోతూఉంటే చూస్తూ నిలబడ్డాడు. నిలబడి అయిదేండ్లు తిరిగిన ఫలితం పొందినందుకు ఆనందిస్తున్నాడు. ఆపై ఆమె ఇంటికి పోవడం ఎప్పుడని ఆలోచిస్తున్నాడు!...

ఆ తరువాత ఒకానొక రోజు!... అందమైన బజార్లో ఆలోచిస్తూ నడుస్తూ ఉన్న చిట్టిబాబు!... అతని మనస్సులో గీత మెదిలింది. ఆమె ఆహ్వానం గుర్తుకువచ్చింది. అంతే! ఆలోచనలకు స్వస్తి పలికాడు చిట్టిబాబు. గీత ఇంటిదారి పట్టాడు. అడుగడులో ఆమె అందం ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే ఊహల్లో తేలుతూ నడుస్తున్నాడు. గీత ఇంట్లో అడుగు పెట్టాడు. అతని రాకకోసమే కాచుకొని కూర్చున్నట్లుంది గీత. సాదరంగా ఆహ్వానించింది. కూర్చోమని కుర్చీ చూపింది. 'ఫ్యాన్' వేసింది. అర సోలెడు పాలల్లో ఆ మాత్రం నీళ్ళు చేర్చి అందమైన గ్లాసులో ఇచ్చింది. ఆ పై అతనికి ఎదురుగా కూర్చొనింది. పేరుకు అతడు తాగుతున్నది పాలు!... చూపులతో అతడు తాగుతున్నది ఆమె సోయగాలు!!...

గీత సాహిత్యాన్ని గురించి మాట్లాడింది. శరత్ సాహిత్యాన్ని గురించి మాట్లాడింది. శేష ప్రశ్నలో 'కమల' అద్భుతమైన మనిషి అని కొనియాడింది. శ్రీకాంత్‌లో శ్రీకాంత్‌ను పిరికివాడనింది. చలంగారి మైదానములో అమీర్ వ్యక్తిత్వాన్ని అభినందించింది. పట్టణాలలో జరుగుతున్న సినిమాల గురించి ప్రస్తావించింది. ఆపై చిట్టిబాబును ఓ పాట పాడమనింది. చిట్టిబాబు పొంగిపోయాడు. తన హృదయాన్ని విప్పి ఆమె ముందు పెట్టగల అవకాశం దొరకినందుకు పొంగిపోయాడు. అయిదేళ్ళ తరువాత లభించిన అదృష్టానికి పొంగిపోయాడు. ఆపై గొంతు సవరించుకొన్నాడు.

ఏ పూలతో నిన్ను పూజింతునో చెలియ
ఏ భావగీతికల భూషింతునో సఖియ!
పూచిన పూలన్నీ వాడిపోతున్నాయి
తోచిన భావాలు పాత వౌతున్నాయి!
ముడిచి విడిచిన పూలు మున్నూరు మూరేల
తడిమి విడిచిన భావ సౌందర్యమే గోల!
వాడి పోనీ పూలు వన్నెరైన భావాలు
దొరకునా నీ పూజ జరుగునా మనసార!

పాట ఆగింది. ఆమె పైకి లేచింది. లేచి నవ్వుతూ లోనికి వెళ్ళింది. మరో రెండు నిముషాల్లో దోసెడు పూలతో తిరిగి వచ్చింది. ఆ దోసెడు పూలు టేబిలు మీద పోసింది.

"చూడండి! మీరు కవులు. ఎప్పుడూ ఊహా జగత్తులోనే విహరిస్తుంటారు. అలా అయితే లాభం లేదు. వాస్తవ జగత్తును కూడ అప్పుడప్పుడు చూస్తూ ఉండాలి. లేకపోతే హాని జరగడానికి అవకాశం ఉంది. ఇప్పుడు చూడండి. మీరు వాడిపోని పూలు దొరకలేదని మీ ప్రేమ పూజను వాయిదా వేసుకొన్నారు. ఈ వాడిపోని పూలు మార్కెట్‌లోకి వచ్చి చాల రోజులయింది. ఈ పూలను పట్టుకొని వెళ్ళండి. మీ ప్రేయసిని ఈ వాడిపోని పూలతో మనసార పూజించండి. ఇప్పటికే ఆలస్యమైనట్లుంది!" వస్తున్న నవ్వును ప్రయత్న పూర్వకంగా ఆపుకొంటూ అనింది గీత.

టేబిలు మీద పూలను పరిశీలించి చూశాడు చిట్టిబాబు. పరిశీలించి చూసి పాలిపోయాడు చిట్టిబాబు!... అవన్నీ ప్లాస్టిక్ పూలు!...

గొంతులో తడి ఆరింది. ముండ్లమీద కూర్చున్నట్లుంది. లేచి నిలబడ్డాడు. తిరుగుతున్నది తలనా? లేదు లోకమా?... అర్థం కాలేదు. గీత కొంటెగా చూస్తూ నవ్వుతూ ఉంది సన్నగా సన్నజాజిలా! అక్కడ నిలబడలేకపోయాడు చిట్టిబాబు. గీత నవ్వుతూంటే చిట్టిబాబు ఆ ఇంటి గడప మెట్లు దిగుతున్నాడు. మెట్లమీద దిగుతూంటే గీత విరగబడి నవ్వడం వినిపిస్తూ ఉంది. వినిపిస్తూ వీపుమీద శూలంలా పొడుస్తున్నట్లుంది. నిట్టూర్చాడు చిట్టిబాబు. నిట్టూరుస్తూ అరచేతిని చూసుకొన్నాడు. అయిదేండ్ల తరువాత అరచేతిని చూసుకొన్నాడు. అరచేతిలో గీత!– అదృష్టాన్ని తేగలిగిన ఒక్కగా నొక్క గీత!– అది మారలేదు. ఆశించిన గీత!– అరచేతిలోకి రాలేదు. రెండు కన్నీటి బొట్లు మాత్రం రాలి అరచేతిలో పడ్డాయి. ఆ కన్నీళ్ళు గీత నిండుకు నిండుకొన్నాయి. ఆ గీత! అంతయి... ఇంతయి... అలనాటి వామనుడిలా ఆ వీధి అంత అయింది. ఆ వీధి ఓ కన్నీటి ప్రవాహంలా ఉంది. ఆ ప్రవాహంలో పడి కొట్టుక పోతున్నాడు అయ్యోపాపం! చిట్టిబాబు! ●

**ఈరేడు లోకాలు**
(చిత్తూరు జిల్లా రచయితల సంఘ కథాసంపుటి, 1976)